క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం: మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకూ స్థానిక 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సెప్టీ క్లీనర్ల అందజేత



సెప్టీ క్లీనర్లను ప్రారంభిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ తదితరులు

ముమ్మిడివరం: నేషనల్ సఫాయి కర్మచారిస్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రెల్లి కుటుంబాలకు మంజూరైన సెప్టీ క్లీనర్లను ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ముమ్మిడివరం నగర పంచాయతీకి చెందిన ఇద్దరు లబ్ధిదారులు కాకి తలుపులమ్మ, నిమ్మకాయల మహాలక్ష్మిలకు ఈ సెప్టీ క్లీనర్లు మంజూరయ్యాయి. వీటిని చైర్మన్ ప్రవీణ్‌కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ నూకరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సునీల్‌కుమార్

అల్లవరం: మండల నూతన తహసీల్దార్‌గా పి.సునీల్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ సెక్రటేరియట్‌లో ప్లానింగ్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూ రెండు సంవత్సరాల ట్రైనింగ్ పీరియడ్‌లో భాగంగా అల్లవరం తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఆయన గతంలో ఏపీ సెక్రటేరియట్‌లో ఏఎస్ఓ, ఎస్ఓ, పెరవలిలో ఆర్ఐగా విధులు నిర్వర్తించారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సునీల్‌కుమార్‌ని డీటీ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఆర్ఐ ఎండీ శ్రీనివాస్, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలంటూ వినతి



జేసీ నుపూర్ అజయ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

అమలాపురం రూరల్: రైతుల రుణాలు మాఫీ చేయాలంటూ ఏపీ రైతు సంఘం ప్రతినిధులు జేసీ నుపూర్ అజయ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. రైతులందరికీ రూ.2 లక్షల వరకూ రుణాలు మాఫీ చేయాలని, ఎకరానికి రూ.15 వేలు సాగు సాయంగా అందించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.25 వేలుగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సీహెచ్ కేశవ శెట్టి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన తాతారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంపట్ల వరుణ్ బాబు, జంపన ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ధర్నా



సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేస్తున్న స్థానికులు

తాళ్లరేవు: యానాం బైపాస్ సుంకరపాలెం జంక్షన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ స్థానిక వ్యాపారులు, ప్రజలు గురువారం ధర్నా నిర్వహించారు. జాతీయ రహదారి 216 విస్తరణలో భాగంగా హైవే అధికారులు రహదారి చెంతన నిర్మించిన డ్రైనేజీలో పూడికలు పెరిగిపోయాయన్నారు. జంక్షన్‌లో డ్రైనేజీ మురుగునీరు పారుతూ దుర్వాసన వెదజల్లడంతో పాటు అనేకమంది ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళనకారులు వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీని పునరుద్ధరించి మురుగునీరు పారేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో స్థానిక ప్రజలు, వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుండ్రటి అక్షరాలు.. తెస్తాయి మార్కులు

- పరీక్షల ఉత్తీర్ణతలో దస్తూరికి ప్రాధాన్యం
- విద్యార్థులు సాధన చేస్తే సత్ఫలితాలు



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షలు ముంచుకొస్తుండటంతో విద్యార్థులు రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కోసం ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఏడాది పాటు నేర్చుకున్న అంశాలను రెండున్నర గంటల్లో కాగితంపై పెట్టాలి. అదీ స్పష్టంగా ఎలాంటి కొట్టివేతలు లేకుండా ముత్యా లు లాంటి అక్షరాలతో రాసినవారికే ఎక్కువ మార్కులు తెచ్చుకునేందుకు ఆస్కారముంటుంది. అందుకే ఇప్పుడు అందరి దృష్టి చేతి రాతపై పడింది.

సాధనతోనే మెరుగైన ఫలితాలు

ఇప్పటివరకూ సరిగా రాయకపోయినా ఒక్కసారిగా రాత మార్చుకోవాలంటే నిత్యం సాధన చేయాల్సిందే. తొమ్మిదో తరగతి వరకూ దస్తూరి ఎలా ఉన్నా పదో తరగతి ప్రారంభం నుంచైనా దృష్టి సారిస్తే మంచి ఫలితం ఉంటుంది. అయితే పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇప్పుడైనా రోజూ దస్తూరి సాధనకు కాస్త సమయం కేటాయించి నాలుగైదు పేజీలు రాయాల్సి ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తెలుగు, ఆంగ్లం, హిందీ.. భాష ఏదైనా సాధనతోనే సత్ఫలితాలు కనిపిస్తాయని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పైకి చదువుతూ రాయడం వల్ల జవాబులు బాగా గుర్తుండటంతో పాటు అక్షరాలు అందంగా రాయడం అలవాటవుతుందంటున్నారు.

దస్తూరీతో ఆకట్టుకోవచ్చు

మరీ నెమ్మదిగా రాస్తే పరీక్షల్లో సమయం సరిపోదు. వేగంగా రాసేటప్పుడు తప్పులు దొర్లకుండా ముత్యాల్లాంటి అక్షరాలు రాసేందుకు ప్రత్యేక తరగతులు, స్లిప్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పరీక్షలో ఎదురయ్యే ఏ ప్రశ్నకైనా జవాబు ఇవ్వగలిగినా చేతి రాత బాగోకపోతే మార్కులు సాధించడం కష్టతరమవుతుందంటున్నారు.

చక్కని చేతి రాత ఉంటే పరీక్షా పత్రాలు దిద్దేవారిని సైతం ఆకట్టుకుని మార్కుల శాతం పెంచుకోవచ్చంటున్నారు. రాసే ప్రతి అక్షరం, అందంగా గుండ్రంగా ఉండడంతో పాటు అక్షర దోషాలు లేకుండా అవసరమున్న చోట ఫుల్‌స్టాప్, కామా తదితర గుర్తులు ఉపయోగిస్తూ సమాధానాలు రాయాలని సూచిస్తున్నారు. అక్షరాలు కొన్ని చిన్నవిగా, మరి కొన్ని పెద్దవిగా ఉండకుండా చూసుకోవడంతో పాటు జవాబు పత్రంలో కొట్టివేతలు లేకుండా రాస్తే మంచిదంటున్నారు.

గుండ్రంగా రాస్తున్నా



నిత్యం అందమైన చేతి రాత కోసం ప్రాక్టీస్ చేస్తున్నాను. గతంలో కంటే ఇప్పుడు నా చేతి రాత మెరుగుపడింది. మా పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించి చదివించడమే కాకుండా చేతి రాత మెరుగుపరచుకోవడానికి ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో కొట్టివేతలు లేకుండా గుండ్రంగా రాయడం అలవాటైంది.

– మహాదశ సాత్విక, పదో తరగతి విద్యార్థిని

దస్తూరి కోసం సాధన



మా ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షల్లో దస్తూరి ప్రాధాన్యతను వివరించారు. దీంతో రోజూ అక్షరాలు అందంగా రాయడానికి సమయం కేటాయించి సాధన చేస్తున్నాను. కొట్టివేతలు లేకుండా అక్షరాలు గుండ్రంగా రాయడం అలవాటైంది.

– బి.చందు ప్రియ, పదో తరగతి విద్యార్థిని

చేతిరాతతో మార్కులకు భరోసా



ముత్యాల్లాంటి అక్షరాలతో పరీక్షల్లో మార్కులకు డోకా ఉండదు. విద్యార్థుల చేతిరాత మెరుగు పరిచేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. అందమైన దస్తూరి ఉంటే పరీక్ష పత్రాలు దిద్దేవారికి విద్యార్థులు ఏం రాశారో సులభంగా అర్థమై మంచి మార్కులు పడతాయి. తక్కువ రాసినా తప్పుల్లేకుండా అందంగా రాయడం వల్ల ఆకట్టుకుని మంచి మార్కులు సాధించవచ్చు.

– పచ్చిమాల శివనాగరాజు, తెలుగు పండితుడు

డీఎస్పీని కలిసిన వ్యాపార సంఘాల ప్రతినిధులు



డీఎస్పీ మహేశ్వరరావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న వ్యాపారులు

అమలాపురం టౌన్: ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ ఎం.మహేశ్వరరావును ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాపారులంతా డీఎస్పీ మహేశ్వరరావుకు పూల కుండీ అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీని కలిసినవారిలో కొమ్మూరి వెంకటాచలప్రసాద్, మోకా వెంకట సుబ్బారావు, మేడిచర్ల త్రిమూర్తులు, యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కొవ్వూరి వెంకటరెడ్డి, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు. అలాగే రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వాకపల్లి స్వామినాయుడు కూడా డీఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని డీఎస్పీ మహేశ్వరరావు వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు.

నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి మాత్రల కిట్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

అమలాపురం టౌన్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. దీంట్లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని పాఠశాలల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి టాబ్లెట్ల కిట్లను ఆమె గురువారం అందజేశారు. వారంతా శుక్రవారం ఆయా విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వెంకట కృష్ణ, మున్సిపల్ మేనేజర్ మాచిరాజు మూర్తి, పలు విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా పరీక్షల ప్రత్యేక అధికారి సోమశేఖరరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పరీక్షల ప్రత్యేక అధికారి సోమశేఖరరావు

అమలాపురం టౌన్: ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ జరగనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ థియరీ పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్ పరీక్షల ప్రత్యేక అధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ నెల 11వ తేదీ నుంచి 60 పరీక్షా కేంద్రాల్లో జరిగే ప్రాక్టికల్ పరీక్షలను ఇంటర్ ద్వితీయ ఎంపీసీ, బైపీసీలకు చెందిన 7,846 మంది విద్యార్థులు రాయనున్నారని తెలిపారు. అలాగే మార్చి ఒకటో తేదీ నుంచి జరిగే థియరీ పరీక్షల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి ఇంటర్, ఒకేషనల్ కోర్సులకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 37 పరీక్షా కేంద్రాల్లో మొత్తంగా 25,245 మంది విద్యార్థులు థియరీ పరీక్షలు రాయనున్నారని వివరించారు. పరీక్షలకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు, పరీక్ష నిర్వహణాధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ ప్రతినిధులు ఎస్వీ రంగారావు, పి.గోపాలకృష్ణ, ఎం.రామారావు, బి.సింహాద్రిరావు, అమలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవల కోటిలింగం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలోని ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి బళ్లా సత్యనారాయణ, ఏడో తరగతి విద్యార్థి కొల్లి అజయ్ ప్రతిభ కనబర్చారు. ఇటీవల జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఏపీ పోటీల్లో అండర్-14 టెన్నికాయిట్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఆర్ నాగకుమార్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన పీఈటీ చొల్లంగి లక్ష్మీ శ్రీనివాసరావులను హెచ్ఎం నాగకుమార్, ఉపాధ్యాయులు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఐఎస్ఎస్ ప్రసాద్ అభినందించారు.

స్కూలుకు స్కానర్ కం ప్రింటర్ వితరణ



హెచ్ఎంకు ప్రింటర్ ఇస్తున్న వెంకన్నబాబు

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం స్థానిక దాత డాక్టర్ పోతురాజు సూర్య వెంకట సత్యనారాయణ కుమారుడు వెంకన్నబాబు రూ.14 వేల విలువైన స్కానర్ కం ప్రింటర్‌ను అందజేశారు. పాఠశాల హెచ్ఎం పడాల సోమ సూర్యకుమారికి వీటిని అందించారు. ఈ సందర్భంగా వెంకన్నబాబును బోధనా సిబ్బంది సత్కరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు దూది త్రినాథ్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగం పెంచండి

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లి లంక గ్రామాల్లో నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారుల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ డీఎల్ ప్రమద్వార్ పంచాయతీ, గ్రామ రెవెన్యూ కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక గ్రామాల్లో ఆయన పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ అశోక్ ఉన్నారు.

నేడు చొల్లంగి తీర్థం



బాలాత్రిపుర సుందరీ సమేత సంగమేశ్వరస్వామి



రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి

- ముస్తాబైన సోమేశ్వరస్వామి, సంగమేశ్వరస్వామి ఆలయాలు
- విస్తృత ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు

తాళ్లరేవు: చొల్లంగి అమావాస్య పర్వదినం సందర్భంగా చొల్లంగిలో జరగనున్న తీర్థ మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. చొల్లంగిలోని చంద్ర ప్రతిష్ఠిత లింగమైన శ్రీరాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరస్వామి, తుల్యభాగ నదీ తీరాన ఉన్న శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సంగమేశ్వరస్వామివారి ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. సంక్రాంతి తరువాత వచ్చే మాఘ మాసం అమావాస్య రోజున సముద్రస్నానం చేస్తే మోక్షం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల నుంచే భక్తులు పవిత్ర తుల్యభాగ నదిలో స్నానాలు ఆచరిస్తారు.

ట్రాఫిక్ మళ్లింపు

చొల్లంగి తీర్థం నేపథ్యంలో కాకినాడ- యానాం రహదారిలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ తెలిపారు. యానాం నుంచి కాకినాడ వెళ్లే బస్సులను జామకాయల తూము నుంచి గొర్రిపూడి మీదుగా కాకినాడకు, అలాగే కాకినాడ నుంచి వచ్చే బస్సులను గురజనాపల్లి మీదుగా యానాం రహదారికి మళ్లించినట్లు తెలిపారు. తీర్థానికి తరలివచ్చే వేలాది మందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా కాకినాడ సబ్‌డివిజన్ నుంచి డీఎస్పీ కె.హనుమంతరావు ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో 8 మంది ఎస్ఐలు, సుమారు 150 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి

తుల్యభాగ నదీ పాయలో పవిత్ర స్నానాలాచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రవికుమార్ కోరారు. ఆలయాల్లో క్యూ పద్ధతిని పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అలాగే తీర్థం సందర్భంగా రికార్డింగ్ డ్యాన్స్‌లు, గుండాటలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడొద్దని, నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

డిగ్రీలో ప్రవేశానికి విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

రావులపాలెం: ప్రభుత్వ కళాశాలల్లో చేరిన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను పొందటంతో పాటు, ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చప్పిడి కృష్ణ అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల రావులపాలెంలో చదువుతున్న సెకండియర్ విద్యార్థులకు ఓపెన్ డే (డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు అవగాహన సదస్సు) ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ కృష్ణ మాట్లాడుతూ డిగ్రీ ఫస్టియర్‌లో చేరే ప్రతి విద్యార్థి కూడా అవగాహనతో, ఆలోచించుకుని, చదివే గ్రూపును నిర్ణయించుకోవాలన్నారు. మంచి విద్యాబోధన అందించే ప్రభుత్వ కళాశాలలను ఎంచుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు స్కాలర్‌షిప్ సదుపాయాలు వర్తిస్తాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేజర్, మైనర్, సబ్జెక్టులను ఎంచుకుని, తద్వారా ఉన్నత స్థానాలకు చేరాలని చెప్పారు. మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు కళాశాల లేబరేటరీలు, గ్రంథాలయం, గేమ్స్, జిమ్, తరగతి గదులు, వసతులు, డిపార్ట్‌మెంట్లను చూపించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, అధ్యాపకులు సుభాషిణి, సోనీ, హేమలత, సౌజన్య, శ్రీనివాస్, స్వర్ణలత, చినబాబు, రాజేంద్రప్రసాద్, దుర్గాదేవి, శైలజ, రజిని, పూజ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకు వైఎస్సార్ సీపీ నేతల సత్కారం



అంబాజీపేటలో ఎస్సైని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

అంబాజీపేట: నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అంబాజీపేట ఎస్సై కె.చిరంజీవిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పూలమాల వేసి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ మండలంలో మాదకద్రవ్యాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రజా జీవనానికి అంతరాయం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు బండారు మల్లి, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఎంఎం శెట్టి, కోట విజయరాజు, గోసంగి కుమార్‌స్వామి, వక్కలంక రాధాకృష్ణ, కుసుమ వెంకటేష్, మట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల వేతనాలు చెల్లింపు



చెక్కు అందజేస్తున్న చైర్‌పర్సన్ సత్యనారాయణ

మామిడికుదురు: పాశర్లపూడి రైతు భరోసా కేంద్రంలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసిన టీఏ, డీఈఓ, హెల్పర్‌కు మూడు నెలల వేతనం రూ.90,600 చెక్కును పీఏసీఎస్ చైర్‌పర్సన్ యూవీవీ సత్యనారాయణ అందించారు. సొసైటీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అటు రైతులకు, ఇటు ప్రభుత్వానికి అనుసంధానంగా సేవలందించారని వారిని అభినందించారు. సొసైటీ సీఈఓ వై.ఏసురాజు, డైరెక్టర్లు గంధం మాణిక్యం, వాసంశెట్టి వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బయలుదేరిన క్రీడాకారులు



గొల్లవిల్లిలో జెండా ఊపి క్రీడాకారులను సాగనంపుతున్న ఈఓపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి

ఉప్పలగుప్తం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో గొల్లవిల్లి సచివాలయ బాలికల క్రికెట్ జట్టు సభ్యులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడేందుకు గురువారం బయలుదేరారు. ఇప్పటి వరకూ సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో గెలుపొందిన గొల్లవిల్లి జట్టు విశాఖపట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి జెండా ఊపి క్రీడాకారులను సాగనంపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది మండలానికి, జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎల్.రాణి, పీడీ గొలకోటి ఫణీంద్ర, సచివాలయ కన్వీనర్ పోలిశెట్టి వీరబాబు పాల్గొన్నారు.

జిల్లా విస్తారక్‌లకు ద్విచక్ర వాహనాలు



జిల్లా విస్తారక్‌లకు ద్విచక్ర వాహనాలు అందిస్తున్న యాళ్ల దొరబాబు

అమలాపురం రూరల్: స్థానిక బీజేపీ కార్యాలయంలో విస్తారక్ యోజనలో భాగంగా జిల్లా విస్తారక్, అసెంబ్లీ విస్తారక్‌లకు పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు చేతుల మీదుగా ద్విచక్ర వాహనాలు గురువారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్ గౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నందూరి శ్రీరామ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ, అమలాపురం అసెంబ్లీ కన్వీనర్ బీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరగనుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులోని లక్ష్మీదేవి పుంత మైదానంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, వైఎస్సార్ ఆసరా మంజూరు పత్రాలను అందజేస్తారన్నారు. ఇప్పటికే ఆరు గ్రామాల్లో ఈ కార్యక్రమం పూర్తయిందన్నారు. రెండో విడత మడికి, చొప్పెల్ల, బడుగువానిలంక, నర్సిపూడి, నవాబుపేట, మోదుకూరు గ్రామాల్లో జరుగుతుందని చెప్పారు. లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా రావులమ్మ పంట జాతర



రావులమ్మ అమ్మవారు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న రావులమ్మ అమ్మవారి పంట జాతరను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఏటా రావులమ్మ అమ్మవారి పంట జాతరను నిర్వహించడం వల్ల పంటలు బాగా పండుతాయని గ్రామస్తుల విశ్వాసం. ఇందులో భాగంగా అమ్మవారికి చలిమిడి, పానకాలు, ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శరవేగంగా నరజాడ-కూళ్ల రోడ్డు పనులు



కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులు

కె.గంగవరం: మండలంలోని నరజాడ–కూళ్ల రహదారికి మహర్దశ నెలకొంది. కొన్నేళ్లుగా ఈ రహదారి గుంతలమయంగా మారడంతో రెండు గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇటీవల రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ గ్రామ పర్యటన చేసే క్రమంలో, ఈ రహదారి సమస్యను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. నిధులు మంజూరు చేయడంతో పాటు, రహదారి నిర్మాణ పనులు వెంటనే జరపాలని ఆదేశాలు కూడా ఇచ్చారు. దీంతో నాలుగు రోజులుగా రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు వారాల్లో పనులు పూర్తి చేసి, రహదారిని ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ తెలిపారు.